# "కొట్లెకు వోతెనే తీరుద్దిగ"

ఖువ్వదిన్నంక మాసోపతికాడు అవుసులోల్ల ఎంకటేశంను కలుసుటాని కాల్లవాడకు పోయిన. వాకిట్ల పిడుకలేసుకుంటున్న అవుసుల రామక్క నన్ను సూడనే సూసింది.

"మంచిగున్నావుర తమ్మి" అంది పనాపి.

"మంచిగనే ఉన్న రామక్క" అని పోబోయిన..

"మా అసోంటోల్లను కండ్లగానెటట్టున్నావురా తమ్మి? నువ్వేమొ నౌకరిగానివయితివి. మా గరీబోల్లతోని మాట్లాడుతె తప్పొరా" అంది నిష్టూరంగ.

"గట్లెందుకుకంటవు రామక్క! నా సంగతి నీకు తెలవుదా? నువ్వెప్పుడన్న మాట్లాడుతనంటె నేనెల్లపెయిన్నా? ఇగేం మాట్లాడ్తవో మాట్లాడు. నువ్వు పొమ్మనేదాక పోను. బావచ్చినంక నల్లగల్లు తెమ్మను. ఇయ్యాంపుల మిందు జేసుకుంటం" అని అక్కడున్న మంచంల కూసున్న.

"నువ్వు మా యింట్ల తింటనన్నంక చెరవొయ్యయినా తెప్పిచ్చిపెడుత. సరేగాని ఎప్పుడచ్చినవు?

"నిన్ననే అచ్చిన రామక్క".

"ఏమాయెర తమ్మి? నీ అల్లుండ్లెదుగవట్టిరి? నీ బిడ్డేమొ ఏలెడంతన్న లేపాయె. ఆల్లకెప్పుడు లగ్గాలు గావాలె?" అంది పరాశికంగ.

"నాకు బిడ్డలకేం కరువు రామక్క. ఎదిగినోని కెదిగినట్టు బిడ్డెనిచ్చి లగ్గం జేత్తన్నా? లేదా?' , గాల్లందరు నీ బిడ్డలు గారనెందుకంట గని నీ బిడ్డనిత్తవా లేదా?"

"ఎందుకియ్య రామక్క. కని నా బిడ్డంజేసుకునేటోడు నాకే లక్షలిచ్చి దానికాల్లు మొక్కాలె. తెల్సిందా మరి"? అని నవ్విన.

"నీ బిడ్డ గంత బంగారు బిడ్డారా తమ్మి. నువ్వే ఎవ్వనియో కాల్లు మొక్కి బిడ్డనిత్తవో లేదో బతుకుంటె సూడనా నేను".

"నువ్వు బతికుండకుంటేడికి పోతవు రామక్క? నేను నిజంగా సెప్పుతన్న. నువ్వు సచ్చేదాక బతుకుతర్" పరాశికమాడిన.

"పెద్ద సంగతే కనిపెట్టినవుర తమ్ముడు. కని ఏం బతుకుడుర తమ్మి? మీ బావ గా సుత్తె కొట్టుడే కొట్టుడా? గడియరికాల లేకపాయె గవ్వ రాకల్లేకపాయె అన్నట్టుందిరి మా ఎవారం?" నిరాశతో నంది రామక్క.

"ఏంది రామక్కంత ముంచుకపోయినట్టు సెయ్యవడితివి. బావకు సేతినింద పని దొరుకుతలేదా? ఏంది? అన్న నేను.

"పనేడిది తమ్మి? గిప్పుడు నగలేసుకునేటోల్లెవ్వలు సెప్పు? తులానికి మూన్నాలుగువేల దరుంటె గా బంగారన్నెవ్వలు గొనాలె సెప్పు? మల్ల ఆడోల్లకు గూడ మునుపటి తీరుగ నగలమీన సోకులు లేకుంటయిపెయింది. అందరు బట్టలకెగవడ్డరు. ఊల్లల్ల గూడ తీరుతీరు బట్టలు గడ్తంండ్రు. మునుపు ఓ తీరు గిరాకున్నప్పుడేమో నాలుగు పైసలెనుకెయ్యకపాయె మీ బావ. ఎపుడచ్చినయప్పుడు తాళ్ళల్లకురికి నాశినెం జేసె. గిప్పుడేమొ పురాగెల్లకుంట గావట్టె".

"నువ్వన్నది నువ్వద్దెకని రామక్క మరి బావ నింకేదన్న పని జూసుకొమ్మనకపెయినవా?'

"అయినెకింకేం పనత్తది సెప్పు? ఏడెనిమిదేండ్ల ఈడప్పటికెల్లి గీ పని జేసుకుంటనే వుండె. గీ ముసల్తనానికి ఇంకో పనెట్ల జేత్తడు?"

"నిజమే రామక్క. రోజురోజుకు సాతగాకుంట గావట్టె. కొడుకులే జేత్తండ్రు మరి?"

"రేడియల రిపేరింగు జేత్తండు. రోజుకయిదో పదో వత్తె అవ్వాని కర్సులకే సాల్తలెవ్వ. ఆనికి లగ్గం గూడాయె. అదోటి మెడకు వడె. ఏం జెయ్యల్నో తెలవక తల్లడిల్లుతండు" రామక్క మొకం సిన్నవోయింది.

"ఎట్ల ఎల్లెటోల్ల కట్లెల్లుతది రామక్క. మొకమెందుకు సిన్నబుచ్చుకుంటవు? బావ కనవడుత లేడేంది? తాళ్ళల్లకు గిట్ల పెయిండా ఏంది?" అన్న నవ్వుకుంట. ఇగ గదొక్కటే తక్కువైంది తమ్మి, పాపమయినది అలువాటయిన పానమాయె. రొండు మూడు రూపాయలు సేతులవడితె మా ఉరుకుంతనంటడు. కని గిరాకే లేకుంటయిపాయె. రొండెకురాలంత బూముంటె ఆయింత ఒడగాసుడైతంది. ఇంకో అరెకురం మిగిలిందిగ. సిన్నపోల్లను నీల్లాటకు తీసుకరాను పెయిండు మీ బావ, రేపత్తడు" అంది.

"మీకే ఎల్లకుంటుంటె మల్ల గామెనెందుకు నీల్లాటకు తీసుకచ్చుడు. ఆల్లదాల్లు సూసుకోరా? గీ పెద్దిరుకాలెందుకు[18] రామక్క?" కొంచెం కోపంగన్న

"సదువుకున్నోనివి నీకు గివ్వన్ని తెలువయి తమ్మి! మొదాటికాన్పు తల్లిగారింటికాన్నే సెయ్యాలె. ఎంత లేకిడోల్లకైన ఎల్లకున్నా గిది తప్పది. అప్పు సప్పయినా గని సెయ్యాలె. లేకుంటె దిక్కుమల్లె వంశమని[19] దానత్తమామలు, ఆడిబిడ్డలు గునిపిత్తరు. కర్సుకు బయపడి దాన్ని గారంపాటంల పెట్టుడెందుకు సెప్పు? ఇప్పుడది కాన్పుకత్తె ఎంత లేదన్నా ఐదారు సూర్లన్న ఖర్చయితయి. ఏం జేత్తాం! ఏన్నన్న దూసుకరావాలె! పొల్లగండ్లను కన్నంక కర్సులు తప్పుతయా

మరి?

"ఏమో రామక్క. గివ్వయితే నా కనవసరమనిపిత్తయి. ఒగలింటికిచ్చినంక దాని సందాన దాన్నిడిపెట్టాలె. సరే.........బంధవస్తుగుంటె ఇంత కర్సు వెట్టినా మంచిదే కని బాకీలైసి కాన్పులు సేసుడెందుకు చెప్పు?" అన్న నేను

"నీకు తెలువది. నువ్వు బిడ్డ లగ్గంజేత్తె గప్పుడన్ని తెలుత్తయి" అని పిడుకల్జేసుడు మొదలుపెట్టింది రామక్క.

నేను పోవుటానికి లేసిన. మొసకొట్టుకుంట పిడుకల్జేసిన రామక్కతోని గప్పుడే అచ్చిన కుందెల్లమ్మంది.

"ఏందవ్వ రామవ్వ? ముసల్దానివైనావు? ఇంక పెండేసుకచ్చుకుంట పిడుకల్జేత్తన్నవ్......? గింతాపేక్షనెందుకు సెప్పు? బలెదానివి పో. బువ్వన్న తిన్నవా? పొద్దు నడినెత్తిమీనికచ్చింది. కొడుకెదిగిండు. ఇద్దరు బిడ్డలకు లగ్గమాయె. ఇంకెన్ని దినాలు కట్టపడుతవు?"

పనాపి కుందెల్లమ్మ మొకాన సూసింది రామక్క. నేను పోయెటోన్నాగిన.

"నీకు తెలువదానె ఎల్లి నా సంగతి. మల్ల గట్లనే మాట్లాడ్తవు. నా అనుమంల[20] పనే రాసిపెట్టిండు దేవుడు. ఇగో గింతప్పటికెల్లి పెండ, పిడుక, కట్టె పుల్లలేరు కచ్చుకుంటనే ఉంటి. లగ్గమయి గీ ఇంట్లవడ్డంక ఇంకింత పని పెరిగె. అత్తమామలున్నన్ని దినాలు భూమ్మీన ముడ్డి మోపింది లేపాయె. అటెనుక నా సంసారమాయె. మబ్బుల కోడి కూసినంక లేత్తె మల్ల ఏ అద్దుమనాతిరో పంటెదాక పని దప్పకపాయె. పక్కలకెల్లి లేసి ఆకిలూడ్సి, అలుకుజల్లి, బోల్లు దోముడు, ఇంట్ల పనంత జేసుడు. వంట జేసుడు. గివ్వన్ని జేసుకొని బుక్కెడంత నోట్లె వెట్టుకోని కయికిలి పోవుడాయె. అక్కడ నడుమెత్తకుంటనే పనాయె. మల్ల పొద్దుగూకి ఇంటికచ్చినంక పని దప్పకపాయె. ఇగ గీ బతుకు గిట్లనే గడిసిపోవట్టె. ఇంట్ల ఎల్లు మానుంటె కూసుండి మా తినచ్చు గని గిప్పుడుట్టిగుంటె నడుత్తదా సెప్పు. ముసల్దాన్నైతన్న నిజమే. కొడుక్కింత నౌకరైతె కూసుండి తినచ్చుననుకుంటె దేవునిగుల్లె మన్నువొయ్య కండ్లజూత్తలేకపాయె. ఇంట్ల గీ సందముంటె ఇగ పనెట్ల తప్పుతదే ఎల్లమ్మ" అంది రామక్క నిల్సొని.

"ఇగో గీ పని గా కాట్లెకు వోతెనే తప్పుద్ది" అంది రామక్కే మల్ల.

"గట్లెందుకంటవు రామక్క. అదే ఎల్లుద్ది తియ్యి. కొన్నొద్దులమాస. కొన్నొద్దులు పున్నమని ఇగ నేం బొయ్యత్త" అని పోబోయిన పదోటి పేలియిండు. ఏదన్న నౌకరి జూడలేవు".

"నా సేతులుందా రామక్క. నా నుంచైతె మా సూత్త" అనుకుంట ఎంకటేశమింటికి పెయిన.

రామక్క అమాయకత్వం బతుకువెతలు యాదికత్తె నా కండ్లు చెమర్చుతయి.